

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 07 మే 2026 పేజీలు : 04


# రూ. 1 లక్ష కోట్లతో 5వ తరం ఫైటర్ జెట్ ప్రాజెక్ట్

## ఈ నెల 15న భూమి పూజలో పాల్గొననున్న కేంద్ర రక్షణమంత్రి రాజ్ నాథ్, ముఖ్యమంత్రి, మంత్రులు బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి

**శ్రీ సత్య సాయి జిల్లా, మే 06, ప్రభాతవార్త ప్రతినిధి**

రాయలసీమ తలరాతను మార్చేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 1 లక్ష కోట్లతో 5వ తరం ఫైటర్ జెట్ ప్రాజెక్ట్ కు ఈనెల 15వ తేదీన భూమి పూజ చేయనున్నట్లు బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి తెలియజేశారు. బుధవారం పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, దేశ రక్షణ రంగ చరిత్రలో ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా రాయలసీమ ప్రాంతం సరికొత్త మైలురాయిని చేరుకోబోతోందన్నారు. ఇందులో భాగంగా మొదట దశలో 15 వేల కోట్లు పెట్టుబడులు రానున్నాయని, వేల సంఖ్యలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. 2027 నాటికి యుద్ధ విమానం యొక్క మొదటి మోడల్ సిద్ధమోతుందని, 2028లో తొలి ప్రయోగాత్మక గగన విహారం చేస్తున్నట్లు తెలిపారు. 2034 నాటికి పూర్తిస్థాయి సర్టిఫికేషన్ పొంది వాయుసేనకు అందుబాటులో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ గొప్ప అవకాశం కల్పించిన ప్రధాని నరేంద్ర మోడీకి, కేంద్ర రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్కు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ప్రాజెక్ట్ కోసం డి ఆర్ డి ఓ కు సుమారు 600 ఎకరాల భూమిని కేటాయించారని, మొదటి దశలో 150 సేకరణ దాదాపుగా పూర్తయిందని తెలిపారు. ఇందులో రక్షణ రంగ దిగ్గజ సంస్థలైన టాటా అడ్వాన్స్డ్ సిస్టమ్స్, ఎల్ అండ్ టీ, భారత్ ఫోర్జ్ వంటి కంపెనీలు భాగస్వాములుగా ఉంటాయని వివరించారు. ఈ కేంద్రంలో మొత్తం 140 యుద్ధ విమానాలను తయారు చేయాలన్నది లక్ష్యం. దీనివల్ల రాయలసీమ నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పుట్టపర్తి దేశ రక్షణ రంగంలోనే అత్యంత కీలకమైన కేంద్రంగా మారుతుందని, స్థానిక సత్యసాయి విమానాశ్రయం కూడా ఈ ప్రాజెక్టులో కీలక పాత్ర పోషించనుందని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొ న్నారు. దేశంలోని ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓటమి అనంతరం కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. సుమారు 50 సంవత్సరాల తర్వాత దేశంలో ఒక్క కమ్యూనిస్టు ముఖ్యమంత్రి కూడా లేరని, మీదే నిజమైన కమ్యూనిస్టు ముక్త భారత్కు సంకేతం అని వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్ రాజకీయాలపై స్పందిస్తూ, ప్రజల తీర్పును మమతా బెనర్జీ గౌరవించాలని,అయితే రాజీనామా చేయబోనని ఆమె చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ విషయంలో రాహుల్ గాంధీ మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. దేశ రాజకీయాల్లో బాధ్యతాయుత వైఖరి అవసరమని, ప్రజల తీర్పును గౌరవించడం ప్రతి పార్టీ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో బిజెపి సీనియర్ నాయకులు బూదిలి సుదర్శన్, కొండమరాజు, కత్తి రాజారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జ్యోతి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమలేషు, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బాలగంగాధర్, పట్టణ అధ్యక్షులు కళ్యాణ్ కుమార్, గిరిజన మోర్చా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ నాయక్, పట్టణ కార్యదర్శి నారాయణ, ఐటి సెల్ కన్వీనర్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్లకు తుంగభద్ర బోర్డు బిల్లులు చెల్లింపులు



- కోట్లాది రూపాయల బిల్లులు చెల్లింపులు అక్రమాలు
- కొందరు బోర్డు అధికారుల చేతివాటం
- సీఎం ఆఫీస్ ఆదేశాలకే తూట్లు
- ఎస్ ఆర్ సి ఇన్ఫ్రా బిల్లుల్లో కోత
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న కాంట్రాక్టర్లు

**అనంతపురం, మే 6, (ప్రభాతవార్త బ్యూరో)**

ఆంధ్ర, కర్ణాటక ఉమ్మడి ప్రాజెక్టు అయినా తుంగభద్ర జలాశయం పరిధిలో చేసిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి మే నెలలో కోట్లాది రూపాయల మంజూరు చేసిన బిల్లులలో తుంగభద్ర బోర్డు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆరోపణలు వస్తున్నాయి. వివిధ నిర్మాణ సంస్థలకు, కాంట్రాక్టర్లకు ఒక విడతలో మంజూరు చేసిన బిల్లులకు సంబంధించి ఒక్కొక్కరికి ఒక విధంగా డబ్బులు రిలీజ్ చేసినట్లు, కొందరికి ఎక్కువ శాతం , కొందరు తక్కువశాతం డబ్బులు మంజూరుచేసినట్లు బలంగా ఆరోపణలు ఉన్నాయి. ఇందులో భాగంగా తుంగభద్ర బోర్డులో ఉన్న ఆంధ్రప్రదేశ్ చెందిన కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శించి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులలో చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలుఉన్నాయి.ఈ విషయంలో ఏపీ ప్రభుత్వ పెద్దలకు, సంబంధిత ఉన్నత స్థాయి అధికారులకు బాధిత కాంట్రాక్టర్లు ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. నిర్మాణ పనులకు సంబంధించి ఒకేసారి మొత్తం బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించ లేనప్పుడు ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బులో దామాషా ప్రకారం ఇంత శాతం ప్రకారం ఆ యొక్క కాంట్రాక్టర్లకు, నిర్మాణ సంస్థలకు చెల్లించాలి. ఆ విధంగా చెల్లించకుండా తుంగభద్ర బోర్డు అధికారులు ప్రస్తుతం మే నెలలో చెల్లించిన బిల్లులో నిబంధనలు పాటించలేదని, కొందరు అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని , కొందరు కాంట్రాక్టర్లకు కొమ్ము కాసారని బలమైన ఆరోపణలు వస్తున్నాయి.. ఒక ఉదాహరణలు పరిశీలిస్తే ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలో అధికార తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు (కళ్యాణదుర్గం) సంబంధించిన నిర్మాణ సంస్థ ఎస్ఆర్సి ఇన్ఫ్రా డెవలపర్స్ కి బిల్లులు చెల్లింపులోకూడా తుంగభద్ర బోర్డు అధికారులు మస్కాకొట్టినట్లు, నిబంధనలుతుంగలో తొక్కినట్లు విశ్వసనీయంగా తెలియవచ్చింది. కోట్లాది రూపాయల పనులకు సంబంధించి మిగతా నిర్మాణ సంస్థలకు, కాంట్రాక్టర్లకు ఎక్కువశాతం బిల్లులు మంజూరు చేసి ఎస్ఆర్సి ఇన్ఫ్రా డెవలపర్స్ కి మాత్రం 31 శాతం మాత్రమే బిల్లులు మంజూరు చేసినట్టు తెలిసింది. మిగతా కాంట్రాక్టర్లకు ఎక్కువ శాతం నిధులు మంజూరు చేయడం విమర్శలకు తావిస్తోంది. తుంగభద్ర బోర్డు పరిధిలో ఆర్ .బి .ఎల్. ఎల్ .సి కింద 205.450 కిలోమీటర్ వద్ద నుంచి 210.00 కిలోమీటర్వరకుకాలువ లైనింగ్ , ఇతర నిర్మాణంపనులను ఎస్ఆర్సి ఇన్ఫ్రా డెవలపర్స్ సంస్థ 2023 జూలైలో చేపట్టి పూర్తి చేసింది. ఈపనులకు సంబంధించి 7,26,83,109 రూపాయలు బిల్లు ఆ సంస్థకు ఇవ్వాల్సి ఉంది. ఆమేరకుబిల్లులు మంజూరుకు అధికారులు అన్నిఫైలు సిద్ధం చేశారు. అయితే మే నెలలో ఏపీ ప్రభుత్వం తుంగభద్ర బోర్డుకు బిల్లులకు సంబంధించి కేటాయించిన మొత్తాల్లో ఎస్ఆర్ సి ఇన్ఫ్రా సంస్థకు 31 శాతం అంటే 25 ,71,331 రూపాయలు మాత్రమే విడుదల చేసినట్లు తెలియ వచ్చింది. ఈ సమయంలోనే కొందరికి 50 శాతం, కొందరికి 60 శాతం పైన కోట్లాది రూపాయల విడుదల చేసి సంబంధిత పలు నిర్మాణ సంస్థలకు అనుకూలంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మాఎమ్మెల్యే అధికార పార్టీలో ఉన్నారని,, ఆయనకు సంబంధించిన నిర్మాణ సంస్థ చేసిన పనులకే బిల్లులు చెల్లింపుల్లో అందరితోపాటు చెల్లించకపోతేఎలా అని ఎస్ఆర్సి ఇన్ఫ్రాడెవలపర్స్ సంస్థ ముఖ్యులు అసంతృప్తితో ఉన్నారు. తుంగభద్ర బోర్డు అధికారులు చేసిన ఈ వ్యవహారంపై ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ఆనిర్మాణసంస్థ సిద్ధమవుతున్నట్లు తెలియవచ్చింది.. చేసిన వివిధఅభివృద్ధి పనులకు మొత్తం బిల్లులు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెద్దలు ఆదేశించినప్పటికీ , స్వయంగా బోర్డు అధికారులకు ఫోన్ చేసి చెప్పినప్పటికీ ఆదేశాలను అమలు చేయలేదని ఎమ్మెల్యే సురేంద్రబాబు వర్గీయులు చెబుతున్నారు. తుంగభద్ర బోర్డు అధికారులు బిల్లులు చెల్లింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై టీబీ డ్యాం ఉన్నతాధికారులు, ఏపీ ప్రభుత్వం ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.. ఆంధ్ర, కర్ణాటక ప్రభుత్వాల ఉమ్మడి ప్రాజెక్టు అయిన తుంగభద్ర జలాశయం , కాలువల నిర్వహణ తుంగభద్ర బోర్డు పరిధిలో ఉంటుంది. తుంగభద్ర బోర్డు లో కర్ణాటక, ఏపీ అధికారులు ఉంటారు. తుంగభద్ర బోర్డు కింద చేపట్టే వివిధ పనులకు , నిర్వహణకు ఏపీ ప్రభుత్వం 60 శాతం వాటా నిధులు ఇస్తే కర్ణాటక 40 శాతం నిధులు ఇస్తాయి. ఇందులో భాగంగా తుంగభద్ర బోర్డు పరిధిలో వివిధ నిర్మాణం పనులకు సంబంధించి ఏపీ వాటా కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.. ఆ నిధుల్లో మే నెలలో విడుదల చేసిన నిధుల్లోనే కాంట్రాక్టర్లకు ఇష్టానుసారం ఇచ్చారని, ఒక్కొక్కరికి ఒక రూల్ పాటించాలని, బోర్డు అధికారులు చేతివాటం ప్రదర్శించారని బలంగా ఆరోపణలు వస్తున్నాయి.. ఈ విషయంలో సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు ఈ విధంగా స్పందిస్తారు వేచి చూడాలి.

# ఇకనైనా మారకపోతే కఠిన చర్యలు

## - జిల్లా అదనపు ఎస్పీ అంకిత సురానా - రౌడీ షీటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి కౌన్సిలింగ్





కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు ,కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పి

**హిందూపురం మే 6 ప్రభాతవార్త**

మీ పిల్లలను, కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని ఇకనైనా తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని సత్యసాయి జిల్లా అదనపు ఎస్పీ అంకిత సురాన రౌడీషీటర్లను హెచ్చరించారు. పట్టణంలో బుధవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా జిల్లా అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో హిందూపురం డి.ఎస్.పి కెవి మహేష్ నేతృత్వంలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలు రౌడీషీటర్ ల నివాసాల వద్దకు వెళ్లి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ జిల్లాలో వినూత్నమైన రీతిలో టాప్ రౌడీ షీటర్ల కార్యకలాపాలు వారి కదలికలపై దృష్టి పెట్టడమే కాక ప్రతిరోజు వారు ఏమి చేస్తున్నారు, వారి జీవన విధానం ఏమిటి.. మళ్లీ ఏమైనా నేరాలకు పాల్పడుతున్నారా వారి యొక్క నడవడికపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆ దిశగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ పీస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పోలీస్ అధికారులు రౌడీషీటర్ ఇళ్ల వద్దకే వెళ్లి కౌన్సిలింగ్ ఇస్తూ సత్ప్రవర్తనతో ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో హిందూపురం పట్టణంలో అడిషనల్ ఎస్పీ అంకిత సురాన ఐపీఎస్, డి.ఎస్.పి కెవి మహేష్ తో కలిసి గుడ్డం కాలనీ, బోయ వీధి, రహమత్పూర్, నింకంపల్లి, మోతుకపల్లి లలో పర్యటించారు. పలుమార్లు గొడవలలో పాల్గొని, ఎక్కువ కేసులు నమోదై, రౌడీ షీట్లు ఓపెన్ చేయబడిన వారి ఇళ్లలో తనిఖీలు చేపట్టారు.

అనంతరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో మీడియాతో మాట్లాడుతూ భవిష్యత్తులో మళ్లీ గొడవల్లో పాల్గొంటే, వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయడంతో పాటు, పట్టణ బహిష్కరణ చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. కనీసం 3 నుండి 10 కేసుల వరకు నమోదు అయ పట్టణంలో యాక్టివ్గా ఉండి తరచుగా గొడవలలో పాల్గొంటున్నందు న రౌడీ షీటర్ లతోపాటు వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అంతేకాకుండా హిందూపురం పట్టణంలో మిగిలిన రౌడీ షీటర్ల ఇళ్లలో కూడా దశలవారీగా తనిఖీలు నిర్వహించబడతాయని, ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వారిపై కూడా ఇలాంటి కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలియజేయడమైనది. కార్యక్రమంలో సిఐలు జనార్ధన్, కరీం, ఆంజనేయులు, ఎస్సైలు రాజేష్, లింగన్న, ప్రసన్న లు మొదలగు వారు పాల్గొన్నారు.

# 10 మంది అంతర్ రాష్ట్ర దోపిడి ముఠా సభ్యులు అరెస్ట్

## - రూ.1 కోటి 26 లక్షల నగదు, మూడు కార్లు, 13 సెల్ ఫోన్లు, మూడు కత్తులు స్వాధీనం...- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

**పుట్టపర్తి, మే 06, ప్రభాతవార్త**

శ్రీసత్య సాయి జిల్లాలో రాప్తాడు కనగానపల్లి హైవేలో జరిగిన దోపిడీ కేసులో రెండు సంచలనాత్మకమైన హైవే దోపిడీ కేసులను ఛేదించి పదిమంది ముఠా సభ్యులను అరెస్టు చేయడంతో పాటు వారి నుండి కోటి 26 లక్షల నగదుమూడుకార్లు, 13సెల్ఫోన్లు స్వాధీన పరుచుకున్నట్లు జిల్లాఎస్పీ సతీష్కుమార్ తెలియజేశారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ కేసు వివరాలను అడిషనల్ ఎస్పీ అంకిత, పెనుకొండ సి ఐ రాఘవన్ తో కలిసి ఎస్పీ మీడియాకు తెలియజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, కిడ్నాప్, దోపిడీ, నగదు దోపిడీకి పాల్పడే ఒక వ్యవస్థీకృత అంతర్రాష్ట్ర నేర ముఠా ఎన్ హెచ్ 44పై పాల్పడిన 02 సంచలనాత్మక హైవే దోపిడీ కేసులను శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు విజయవంతంగా ఛేదించడం జరిగిందన్నారు. 2025డిసెంబర్ మూడవతేదీనన ఉదయం సుమారు 03:07గంటలకు ఎన్ హెచ్44పై జరిగిన కిడ్నాప్, దోపిడీ కేసులో, గుర్తు తెలియని దుండగులు కదులుతున్న వాహనాన్ని అడ్డగించి, కిటికీలను పగలగొట్టి, వాహనంతో పాటు ఇద్దరిని బలవంతంగా అపహరించి, 2.8 కోట్లు దోచుకుని, ఆ తర్వాత బాధితులను వేర్వేరు ప్రదేశాలలో వదిలిపెట్టి వెళ్లడం జరిగిందన్నారు. అలాగే కనగానపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2026 ఫిబ్రవరి 21వ తేదీన సుమారు 8 మంది ముసుగు ధరించిన వ్యక్తుల ముఠా, ఎన్ హెచ్44పై మామిళ్లపల్లి గ్రామం సమీపంలో ..3కోట్లనగదుతో వెళుతున్నవాహనాన్ని అడ్డగించి, అందులో ఉన్నవారిని లొంగదీసుకుని, అపహరించి, నగదు మొత్తాన్ని దోచుకుని బాధితులను వదిలిపెట్టి వెళ్ళి పోయారన్నారు. ఈ రెండు కేసులలో కలిపి మొత్తం సుమారు ..5.8 కోట్ల ఆస్తి దోచుకున్నట్లు తెలిపారు. 2026 మే 5వ తేదీనన, బెంగళూరు - గొరట్ల జాతీయ రహదారిపై అఘోర ఆశ్రమం సమీపంలో 07మందిప్రధాన నిందితులు అరెస్టుచేసి, వారివద్దనుండి రూ. 1కోటి 26 లక్షల నగదు, 01 ఇన్నోవా వాహనం, 01 ఎక్స్ యువి 500 వాహనం, 01 తీలీజూ కారు (ఎంపీ 09 డబ్ల్యూ కె 6986), 13 మొబైల్ ఫోన్లు, 02 నకిలీ నంబర్ ప్లేట్లు, 03 కత్తులు, 03 పెప్పర్ స్ప్రే సీసాలు,03 ముఖ కవచాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. ఇప్పటివరకు ఉన్న 21 మంది నిందితులలో, 03 మందిని 2026 మార్చి 15వ తేదీన అరెస్టుచేయగా, మిగిలిన 07మంది కీలక నిందితులను ఈనెల 05న అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఈ ముఠా హైవేలపై లక్షిత వాహనాలను అడ్డగించడానికి నకిలీరిజిస్ట్రేషన్ ప్లేట్లుగల అనేకవాహనాలను ఉపయోగించిందన్నారు. వారు వాహనాల కిటికీలను పగలగొట్టి, సహాయం కోసం చేసే కాల్స్ ను నివారించడానికి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, బాధితులను అపహరించి, వారిని నిర్జన ప్రదేశాలలో వదిలి పెట్టడం జరిగిందన్నారు. ముందస్తు ప్రణాళిక, బాధ్యతల విభజన మరియు వృత్తిపరమైన అమలును స్పష్టంగా సూచిస్తూ, కార్యకలాపాలు నిమిషాల వ్యవధిలోనే పూర్తయ్యాయి. ఫాస్టాగ్ ట్రాకింగ్ను నివారించడానికి టోల్ చెల్లింపులు కేవలం నగదు రూపంలోనే జరిగాయన్నారు. పోలీసు బృందాలు కర్నూలు, మదనపల్లె, బెంగళూరు, సేలం మధ్య ఉన్న 200 కిలోమీటర్లకు పైగా ఎన్ హెచ్44 రహదారి, టోల్ ప్లాజాల నుండి సి సి టీవీ ఫుటేజీని విశ్లేషించి నకిలీ నంబర్ ప్లేట్లను ఉపయోగించి న అనుమానాస్పద వాహనాలను గుర్తించామన్నారు. అనేక సిమ్ కార్డుల యొక్క సిడిఆర్, ఐపిడిఆర్, ఐఎంఈఐ డేటా యొక్క సాంకేతిక విశ్లేషణలో, నిందితులు కేరళ నుండి నకిలీ సిమ్ కార్డులను కొనుగోలు చేసి ఉపయో గించారని, సాంప్రదాయ ట్రాకింగ్ను తప్పించుకోవడానికి మోటో జి 35 మొబైల్ ఫోన్లను ఉపయోగించి విఓఐపి సేవల ద్వారా సంభాషించుకున్నారని వెల్లడైందన్నారు. తదుపరి దర్యాప్తులో, ఈ ముఠా నేరానికి పాల్పడటానికి ముందు కేరళ నుండి తమిళనాడు, కర్ణాటక మీదుగా ప్రయాణించిందని, ముందస్తు నిఘా, ప్రణాళిక కోసం తమిళనాడులోని ధర్మపురిలో ఉన్నలాడ్జిలలోబస చేసినట్లు నిర్ధారించబడిందన్నారు. ఈ ముఠాలో ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర మరియు మధ్యప్రదేశ్ల లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 21 మంది నిందితులు ఉన్నట్టు తెలిపారు. ప్రధాన సూత్రధారి అంతర్జాతీయ వి ఓ ఐ పి కమ్యూనికేషన్ను ఉపయోగించి నేపాల్ నుండి కార్యకలాపాలను సమన్వయం చేసినట్లు తెలిపారు. ఆరు రాష్ట్రాల్లోని అనేక సారూప్య కేసులలో వారి ప్రమేయం, అత్యంత వ్యవస్థీకృతమైన అంతర్రాష్ట్ర నేర ముఠా ఉనికిని నిర్ధారిస్తుందన్నారు. వీరిలో సిరిల్ మాథ్యూ సూత్రధారి కాగా , కె.ఎ. షియాహబుద్దీన్, కరిపాల్ ఆసిఫ్ అహ్మద్ , శరత్ పి.సి., . అప్పు కె.ఎం. శ్రీకాంత్, కొలపురంబిల్ అబునిషాద్, నిషాద్వి.ఎస్,మునీర్,షినోజ్లను అదుపులో తీసుకొని, మిగిలిన 11 మంది నిందితుల ఆచూకీ కోసం గాలింపు జరుగుతోందన్నారు., ఈ కేసును ఛేదించేందుకు, పుట్టపర్తిలోని శ్రీసత్యసాయిజిల్లా పోలీసు సూపరింటెండెంట్ పర్యవేక్షణలో మొత్తం 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో కీలక భూమిక పోషించినపెనుకొండసర్కిల్ఇన్స్పెక్టర్కె.రాఘవన్, హిందూపురం రూరల్ సిఐ ఆంజనేయులు, మడకశిర సర్కిల్ సిఐ రాజ్కుమార్, పుట్టపర్తికోర్ట్ మానిటరింగ్ సీఐ ఇస్మాయిల్, సోషల్ మీడియా సైబర్సెల్ సిఐ గోపీనాథ్ రెడ్డి, ఎస్ఐలు ముని ప్రతాప్, సిటీ మక్బుల్ భాష, రంగడు యాదవ్, సుధాకర్యాదవ్,రాజేష్, వారిబృందంజి.సునీల్ నాయక్, సి.జయరాం, జి.హర్షవర్ధన్రాజ్,రఫిక్, బాబ్జన్, సి.కాటమయ్య, రవీంద్ర నాయక్, ఎం.షకీర్, అబుల్ గౌస్, మంజునాథ్, బి.కె.నరేష్, ఎస్.ఉమాశంకర, ఎస్.ఫరూక్ బాష, కె.చిరంజీవి, వి.కిరణ్ కుమార్, జి.చంద్ర శేఖర్ రెడ్డి, పి.నాగరాజు, బి.రామాంజీ, పై అధికారులు మరియు సాంకేతిక బృందాల సమన్వయ ప్రయత్నాలు ఈప్రధాన అంతర్రాష్ట్రడకోయిటీ కేసులో విజయవంతమైన పురోగతికి దారితీశాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ 10 బృందాలను అభినందించారు.

# నమో నారసింహ..!!

- వైభవంగా లక్ష్మినరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం
- పట్టువస్త్రాలు సమర్పించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్
- రథోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు
- శాస్త్రోత్తంగా జరిగిన బ్రహ్మోత్సవ పూజా కార్యక్రమాలు
- వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- నారసింహుని నామస్మరణతో పునీతులైన భక్తజనం



భక్తజనకోటి మధ్య సాగుతున్న లక్ష్మినరసింహస్వామి రథోత్సవం





**ఉరవకొండ, మే 6 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన ఉరవకొండ మండల పరిధిలోని పెన్నహోబిళ క్షేత్రంలో వెలసిన లక్ష్మినరసింహస్వామివార్ల బ్రహ్మ రథోత్సవం స్వస్తిశ్రీ పరాభవనామ సంవత్సరం వైశాఖ శుద్ధ బహుళ పంచమి బుధవారం సాయంత్రం అత్యంత వైభవంగా, నేత్రపర్వంగా జరిగింది. గతనెల 28వ తేది శుద్ధ ద్వాదశి శుక్రవారం నుండి ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం సుప్రభాతం, మహాభిషేకం, అలంకరణ, బలిహరణ, మంగళహారతి కార్యక్రమాల కొనసాగాయి. ఉదయం రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుతో కలిసి దేవాదాయశాఖ జిల్లా ఏసీ గంజి మల్లికార్జున ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రేగటి నాగరాజు, ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్బాబు పట్టువస్త్రాలతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన నృసింహస్వామి మేళతాళల మంగళవాయిద్యాల నడుమ రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రధానాలయంలో లక్ష్మినరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి, వి ప్ ల క ు వారి ఉత్సవమూర్తుల పల్లకీను మంత్రి పయ్యావుల కేశవ్ మోస్తూ మేళతాళాల నడుమ ప్రత్యేకంగా ముస్తాబుచేసిన రథంవద్దకు తీసుకురాగా రథంలో ప్రతిష్టించి బ్రాహ్మణులు మడుగుతేరు కార్యక్రమాన్ని శాస్త్రోత్తంగా నిర్వహించగా మంత్రి పయ్యావుల కేశవ్ రథాన్ని లాగారు. సాయంత్రం 4.50 గంటల సమయంలో రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేలాదిగా తరలివచ్చిన భక్తులు నమో నారసింహ అంటూ బ్రహ్మ రథాన్ని (ధూళోత్సవం) నిర్వహించారు. ఉద్భవలక్ష్మి ఆలయంవద్ద నుండి మిగతా 4 లో...



# ధర్మవరంలో ఐడీఎఫ్సీ ఏటీఎం మిషన్ ఎత్తుకెళ్లిన దొంగలు...!

## - సినీపక్కీలో ఏటీఎం మిషన్ అపహరణ...! - ఏటీఎం మిషన్ చోరీ సమయంలో రూ.7.50లక్షలనగదు - సీసీపుటేజీలో చోరీ చేస్తున్న దృశ్యాలు రికార్డు...!

**ధర్మవరం, మే 6, ప్రభాతవార్త**

ధర్మవరం పట్టణంలోని పుట్టపర్తికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న ఐడీఎఫ్సీ ఏటీఎం మిషన్ను అంతరాష్ట్ర దొంగలముఠా దొంగతనం చేశారు.వన్ టౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు...బుధవారం తెల్లవారుజామున 340గంటలసమయంలో దొంగలు ఏటీఎంమిషన్ ను చోరీచేశారు. తెల్లవారుజామున 3.32గంటలకు దాదాపు 8మంది బొలొరో వాహనం లో ప్రధాన రహదారి పక్కన ఉన్న ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంకు ఏటీఎం వదకు వచ్చారు.మొదట ఏటిఎం మిషన్ను ఇనుపరాడ్లతో కదిలించిఅనంతరం మిషన్కు తాడును చుట్టారు. ఆ తాడునుబయట ఉన్న బొలెరో వాహనానికి కట్టారు, బొలొరో వాహనాన్ని ముందుకు నడపడంతో ఏటీఎం సెంటర్కు ఉన్న గ్లాస్కు డోరు తాడు తగిలి డోర్ మొత్తం ధ్వంసమైంది. వాహనాన్ని వేగంగా నడపడంతో ఏటీఎం మిషన్ బయటకు వచ్చి పడింది. వాహనంలో సిద్ధంగా ఉన్న దొంగలు వెంటనే బయటపడిన ఏటీఎం మిషన్ను ఎత్తేసమయంలో అటుగా ఒక ద్విచక్రవాహనంలో వెళ్తున్న వ్యక్తి బైకును ఆపి ఏమిజరుగుతోందని ప్రశ్నించేలోపే ఒక దొంగతన వద్దఉన్న ఇనుపరాడ్డును చూపించి మిగతా 4 లో...




ఐడీఎఫ్సీ ఏటీఎంతలుపులు పగలకొట్టిన దృశ్యం.

02ATP27_02ATP27.qxd 06-05-2026 PM 10:44 Page 1



# రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

కంబదూరు, మే 6, ప్రభాతవార్త


మండల వ్యవసాయధికారి మహేష్

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను రాయితీపై అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంబదూరు మండల వ్యవసాయ శాఖ అధికారి మహేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మరియు భారత ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవసాయ యంత్రీకరణపై సబ్ మిషన్ సామ్ పథకం కింద ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా రైతులకు పవర్ టిల్లర్లు, రోటవేటర్లు, హార్వెస్టింగ్ త్రెషర్లు, స్ప్రేయర్లు, నూర్పుడి యంత్రాలు, విత్తన గొర్రులు, ట్రాక్టర్ అనుబంధ పరికరాలు, 40 హెచ్‌పీ వరకు సామర్థం ట్రాక్టర్లను రాయితీపై అందజేయనున్నారు. ఎస్సీ ,ఎస్టీ చిన్న సన్నకారు, మహిళా రైతులకు 50 శాతం రాయితీ, ఇతర రైతులకు 40 శాతం రాయితీ ఇవ్వబడుతుందని వివరించారు. ఆన్ లైన్ తో పాటు , రైతు సేవ కేంద్రాల్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. భూమి కలిగిన రైతులు, ఆర్ ఓ ఎఫ్ ఆర్ రైతులు, గత మూడు సంవత్సరాల్లో కనీసం మూడు పంట సీజన్లలో పంట నమోదు చేసుకున్న రైతులు అర్హులని తెలిపారు. గత సంవత్సరం రాయితీ పొందని రైతులు మాత్రమే అప్లై చేసుకోవాలని, కుటుంబంలో ఒక సభ్యుడు మాత్రమే దరఖాస్తు చేయవచ్చని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక ఆన్లైన్ లాటరీ ద్వారా పారదర్శకంగా నిర్వహించబడుతుందని తెలిపారు. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ సమక్షంలో మండలాల వారీగా, సామాజిక వర్గాల వారీగా ఎంపిక జరుగుతుందని చెప్పారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో లబ్ధిదారుల జాబితా విడుదల చేసి, మంజూరు పత్రాలు జారీ చేస్తారని తెలిపారు. రైతులు ఈ నెల 19వ తేదీ లోపు దరఖాస్తులు సమర్పించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతు సోదరులకు సూచించారు.

# కలేకుర్తిలో వైకుంఠ సమారాధనలో పాల్గొన్న మెట్టు గోవిందరెడ్డి

కనేకల్లు మే 06 ప్రభాత వార్త


శ్రద్ధాంజలి ఘటించిన మెట్టు

మండల పరిధిలోని కలేకుర్తి గ్రామం వైస్సార్సీపీ సీనియర్ నాయకులు జయరాం రెడ్డి అన్న కలేకుర్తి తిప్పారెడ్డి కొద్దిరోజుల క్రితం స్వర్గస్తులయ్యారు. బుధవారం కలేకుర్తి గ్రామంలో తిప్పారెడ్డి గారి వైకుంఠ సమారాధన లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాయదుర్గం సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవింద్ రెడ్డి పాల్గొని చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు ఈ కార్యక్రమం లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉషారాణి మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానంద రెడ్డి చంద్రశేఖర రెడ్డి లోకేష్ గౌడ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా అధికారి

కంబదూరు, మే 6, ప్రభాతవార్త



రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కమ్మన్న బుధవారం కంబదూరు గ్రంథాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో నిర్వహణ, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయానికి సంబంధించిన సెస్ బకాయిలు చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని గ్రంథాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సత్యం బాబు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# టపాసుల గోడౌన్ ని పరిశీలిస్తున్న తహసిల్దార్ బ్రహ్మయ్య

కనేకల్ మే 06 ప్రభాతవార్త



టపాసుల గోడౌన్ ని పరిశీలిస్తున్న అధికారులు

కనేకల్లు మండల పరిధిలోని మాల్యం గ్రామం కు దగ్గరగా ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర క్రాకర్స్ గోడౌన్ నందు కణేకల్ తహశీల్దార్ బ్రహ్మయ్య గోడౌన్ ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ బ్రహ్మయ్య మాట్లాడుతూ. అగ్నిమాపక సిబ్బంది మరియు పోలీస్ సిబ్బందితో కలిసి క్రాకర్స్ గోడౌన్ నందు ప్రభుత్వ నిబంధనల మేరకు భద్రతా ప్రమాణాలను తనిఖీ చేపట్టమన్నారు . గత నెలలో కాకినాడలో టపాసుల గోడం పేలి దాదాపు 30 మంది చనిపోయారు అందువలన ప్రభుత్వ ఆదేశాల మేరకు నిబంధనలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్ గ్రామ రెవెన్యూ అధికారి పవన్ కుమార్ గోడౌన్ యజమాని ఉదయ్ పాల్గొన్నారు.

# పెళ్లి వేడుకల్లో పాల్గొన్న కొండాపురం తెదేపా నాయకులు

బ్రహ్మసముద్రం ఏప్రిల్ 6 ప్రభాతవార్త

అమ్మ సముద్రం మండలం సుగేపల్లి గ్రామం కురుబ చన్నమల్ల మాజీ వైసీపీ కన్వినర్ కూతురు రాధికా వెడ్స్ మల్లి పెళ్ళిలోకర్నూలు జిల్ల పత్తికొండ మండలంలో రాధిక వెడ్స్ మల్లికార్జున నూతన వధువులను ఆశీర్వదించిన సంతే కొండాపురం తాజా మాజి సర్పంచ్ వనిత మల్లి గ్రామపెద్దలు చల్లమల్ల, మల్లికార్జున, అక్కన్న, జయరాజు, వన్నూరు స్వామి భీమ్ రెడ్డి పెళ్లి వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న దృశ్యం

# నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

## రౌడీ షీటర్లకు అదనపు ఎస్పీ వార్నింగ్


రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న జిల్లా అడిషనల్ ఎస్పీ

హిందూపురం మే 06 ప్రభాతవార్త

రౌడీ షీటర్లు నేరాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు ఎస్పి అంకిత సురాన హెచ్చరించారు. ఆపరేషన్ పీస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం హిందూపురం పట్టణంలోని రౌడీ షీటర్లకు అదనపు ఎస్పీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రౌడీ షీటర్లు తమ కుటుంబంతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని గొడవలకు నేరాలకు పాల్పడి జీవితాన్ని పాడు చేసుకోవద్దని తెలిపారు. నేరాలకు పాల్పడితే నాన్ బైబుల్ కేసు నమోదు చేయడంతో పాటు పిడి యాక్ట్, పట్టణ బహిష్కరణ, ఐదు లక్షల వరకు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. రౌడీ షీటర్లు శాంతిభద్రతలకు వివాదం కలిగిస్తే చట్ట పరిధిలో చర్యలు తప్పవని తెలిపారు. అదేవిధంగా రౌడీషీటర్ల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. భవిష్యత్తులో ఆపరేషన్ పీస్ కార్యక్రమంలో భాగంగా మరింత మంది రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో హిందూపురం డిఎస్పీ కేవీ మహేష్, సిఐలు కరీం, జనార్ధన్, ఆంజనేయులు, ఎస్సైలు, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యం

డి.హిరెహాళ్ మే 6 ప్రభాతవార్త



స్వచ్ఛపతంలో శుభ్రం చేయిస్తున్న అధికారులు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని మనమందరం ఆరోగ్యంగా ఉండాలంటే శుభ్రత పాటించాలని ఎంపీడీవో దాస్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం డి.హిరెహాళ్ మండల కేంద్రంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి హనుమేష్, ఆర్డబ్ల్యూఎస్ జేఈ ధనుంజయ, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి ఇతర సిబ్బందితో కలిసి స్వచ్ఛ పతంలో భాగంగ శుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ వద్ద ప్రధాన రోడ్డు పక్కన చెత్తాచెదారంతో నిండి ఉన్న వ్యర్థాలను పంచాయితీ సిబ్బంది, కార్మికులతో కలిసి పరిశుభ్రతకు శ్రీకారం చుట్టి పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతు ఆరోగ్యంగ జీవించాలంటే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను ప్రజలు విధిగ పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. ఎవరికోసమో ఎదురు చూడకుండ తమ ఇళ్ల వద్ద, ఇళ్లల్లోను శుభ్రతను పాటించి ఆరోగ్యవంతమైన జీవన ప్రమాణాలకు ప్రతి ఒక్కరు బాటలు వేసుకోవాలని ఎంపీడీవో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు, సిబ్బంది, కార్మికులు సమన్వయంతో చేపట్టిన స్వచ్ఛ పతం కార్యక్రమంలో పరిసరాల శుభ్రతను విజయవంతం చేయడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు లక్ష్మి, తెదేపా నాయకుడు బీరగొండ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వండి

హిందూపురం టౌన్ మే 06 ప్రభాతవార్త


దుకాణంలో పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

వ్యవసాయానికి సంబంధించిన ప్రతి ఒక్క వ్యాపారి నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కళ్యాణ్ కుమార్, వ్యవసాయ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ముస్తాఫా అన్నారు. బుధవారం హిందూపురం పట్టణంలోని పలు దుకాణాలలో పత్తి విత్తనాల నిల్వను పరిశీలించారు, వాటిలో హెర్బిసైడ్ టాలరెన్స్ ను పరిశీలించి వ్యాపారులకు సూచనలు సలహాలు అందజేశారు. ఈసందర్భంగా వ్యవసాయఅధికారులు మాట్లాడుతూ రైతులుపంట వేసేముందు నాణ్యమైనవిత్తనాలనే కొనుగోలుచేయాలని సూచించారు రైతుల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూపురం వ్యవసాయ సంచాలకులు కృష్ణయ్య, హిందూపురం మండల వ్యవసాయ అధికారి సురేంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

# అసత్య ప్రచారాలను ఖండిస్తున్నాం

## నిరాధార ఆరోపణలతో వార్తలు ప్రచురించడం బాధాకరం

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ముప్పూరి దేవరాజ్

కళ్యాణదుర్గం, మే 6 ప్రభాతవార్త:


విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ముప్పూరి దేవరాజ్

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి సంధిరెడ్డి శ్రీనివాసులుపైకొన్ని మీడియా వర్గాల్లో వస్తున్న ఆరోపణలు నిరాధారమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ముప్పూరి దేవరాజ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు నిజమైనసమాచారం అందించడం మీడియా బాధ్యతని, వాస్తవాలను పరిశీలించకుండా వ్యక్తుల ప్రతిష్టకు భంగం కలిగించేలా కథనాలు ప్రచురించడం సమంజసం కాదన్నారు. ఇటీవల వైరల్ అవుతున్న హనీ ట్రాప్ కేసుతో సంధిరెడ్డి శ్రీనివాసులును అనుసంధానం చేస్తూ వస్తున్న ప్రచారాలను ఆయనఖండించారు. సంధిరెడ్డిశ్రీనివాసులు విద్యార్థి నాయకుడిగా, భారతీయ మజ్దూర్ సంఘం అధ్యక్షుడిగా, అనంతపురం జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పనిచేసి ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా క్రమశిక్షణతో పార్టీ కోసం సేవలందిస్తున్న నాయకుడని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నిబద్ధతతో పనిచేస్తున్న నాయకుడిపై రాజకీయ కారణాలతో కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. మీడియా సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించి వాస్తవాధారిత కథనాలకే ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెక్కా సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, తలారి కిష్టప్ప, కళ్యాణి, రాజేష్, వసంత్, బండి సుధా, కురుబ ముక్కన్న, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్రికల్చర్ పాలిటెక్నిక్కు దరఖాస్తు చేసుకోండి

రామగిరి, మే 6 ప్రభాతవార్త

మండలంలోని రామగిరిలోని ఆచార్యఎంజీరం గావ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరు ఆధ్వర్యంలో కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరంకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరుమణ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సుకు అర్హులు, విద్యార్థులకు హాస్టల్సౌకర్యం కూడా ఉంది. ఈ కోర్సు చదివిన విద్యార్థులు ప్రభుత్వం రంగాలలో మంచి ఉద్యోగం పొం దవచ్చున్నారు. ఏఈఓలు, విలేజ్అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉద్యోగాలతో పాటు ప్రైవేటు రంగాల్లో కూడా మంచి అవకాశాలు ఉంటాయన్నారు. ఈనెల21వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

# ప్రభుత్వాసుపత్రిలో చలివేంద్రం ప్రారంభం

హిందూపురం మే 6 ప్రభాతవార్త



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కార్యదర్శి డా. సురేంద్రబాబు

తెలుగుదేశం పార్టీ యువ నాయకులు యుగంధర్(చింటూ) ఆధ్వర్యంలో స్థానిక జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రిలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్రబాబు లాంచనంగా ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి రోజు వచ్చే వందలాదిమంది రోగులు, తదితరుల కోసం వేసవిలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం పై ప్రశంసించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఏ బాలాజీ, టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్ మొదలగువారు పాల్గొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ హిందూపురం మున్సిపాలిటీలోని వివిధ ప్రాంతాల్లో ప్రతి వారం పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం యుగంధర్, తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

# టిడిపి సీనియర్ నాయకుడు మృతి

హిందూపురం మే 6 ప్రభాతవార్త


శంకరప్ప (ఫైల్ ఫోటో)

హిందూపురం ఆర్య ఈడిగ గౌడ సంక్షేమ సంఘం మాజీ కోశాధికారి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శంకరప్ప(76) అనారోగ్యంతో బుధవారం బెంగళూరులోని ఓ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందారు. తెలుగుదేశం బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ఎస్ అమర్నాథ్ తండ్రి అయిన శంకరప్ప గతంలో టిడిపిలో చురుగ్గా పనిచేశారు. అంతేకాకుండా వీడియో సంఘం అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించారు. కాగా కొన్నేళ్లుగా అనారోగ్యానికి గురయ్యారు ఈ క్రమంలో కన్నుమూశారు. భౌతికకాయాన్ని సాయంత్రం హిందూపురానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# పేదలకు వరం సిఎం సహాయ నిధి డాక్టర్ సురేంద్రబాబు

## 36 మందికి రూ. 12.11 లక్షలు


చెక్కుల పంపిణీ దృశ్యం

హిందూపురం టౌన్ మే 6 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్రబాబు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ క్యాంప్ కార్యాలయం వద్ద హిందూపురం పట్టణంతో పాటు లేపాక్షి, చిలమత్తూరు, హిందూపురం మండలం సంబంధించి 36 మందికి 12 లక్షల పదకొండు వేలు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేంద్రబాబు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు, రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రుల బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో ఏ నియోజకవర్గానికి లేనివిధంగా మన నియోజకవర్గానికి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రతి నెల సీఎం సహాయనిధి ద్వారా నియోజకవర్గంలోని ప్రజలకు చేయూతనిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు వెంకటేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి దుర్గా నవీన్, నియోజక తెలుగు యువత అధ్యక్షులు పూలకుంట మంజునాథ్, హిందూపురం రూరల్, లేపాక్షి, చిలమత్తూరు మండలాల కన్వీనర్లు పాల్గొన్నారు.

# ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బి.హనుమప్ప

## -రాష్ట్ర కౌన్సిలర్లుగా సాకే భాస్కర్, కపట్రాళ్ల దాదా ఖలంధర్

## -జిల్లా కేంద్రం అనంతపురంలో జరిగిన సమావేశంలో ఎన్నిక

ఉరవకొండ, మే 6 ప్రభాతవార్త


జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హనుమప్ప ,రాష్ట్ర కౌన్సిలర్ సాకే భాస్కర్ , రాష్ట్ర కౌన్సిలర్ కపట్రాళ్ల దాదా ఖలంధర్

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్-1938) జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉరవకొండ పట్టణానికి చెందిన బి.హనుమప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాకేంద్రం అనంతపురంలోని ఎన్జీవోహోమ్‌లో బుధవారం ఫెడరేషన్ జిల్లాకౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు అధ్యక్షతన జరుగగా ఈ మేరకు ఎన్నుకున్నారు. ఆయనతోపాటు పట్టణానికి చెందిన సాకే భాస్కర్, కపట్రాళ్ల దాదా ఖలంధర్ రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో విద్యా, ఉపాధ్యాయరంగ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీఆర్సీ కమిటీను నియమించాలని, ఆలస్యమైతే 30శాతం ఐఆర్ ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేసి వోపీఎస్ అమలు చేయాలని, 2003 డీఎస్సీ వారికి జీవో నంబర్ 57 ప్రకారం పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులకు మండల కేంద్రాల్లో పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్రపూర్వ ప్రధానకార్యదర్శి కె.కులశేఖర్‌రెడ్డి, రాష్ట్రఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీక్, ఐఎఫ్ఏఐ సత్య వరప్రసాద్, రాష్ట్రఎన్నికల అధికారులు మాధవస్వామి, పరిశీలకులు పాల్గొన్నారు.

# ఉరవకొండలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం..!

## షరా మామూలే అన్నచందంగా లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన వర్షపు నీరు

## విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఇబ్బందులు

## పిన్నహోబిల క్షేత్రంలోనూ దంచి కొట్టిన వర్షం

ఉరవకొండ, మే 6 ప్రభాతవార్త


పట్టణంలో వర్షం కురుస్తున్నప్పటి దృశ్యం

ఉరవకొండ పట్టణంలో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రాత్రి 7.30 గంటల నుండి మొదలైన వర్షం గంట పాటు ఏకధాటిగా కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. భరించలేని ఎండలతో ఉక్కపోతల నడుమ ఇబ్బందులు పడుతున్న ప్రజలు భారీ వర్షానికి సేద తీరినట్లు అయింది. షరా మామూలే అన్నచందంగా పట్టణ నడిబొడ్డులోని క్లాక్ టవర్ కూడలితో పాటు లోతట్టు కాలనీల్లో వర్షపు నీరు రోడ్లపైకి చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వర్షం మొదలైనప్పటి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పట్టణంలో అంధకారం ఏర్పడి ప్రజలు అవస్థలు పడ్డారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలోను రాత్రి వర్షం కురవడంతో భక్తుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. రథోత్సవం సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చి క్షేత్రంలోని వివిధ ప్రదేశాల్లో గుడారాలు వేసుకొని ఉన్న ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీనికి తోడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గందరగోర పరిస్థితులు ఏర్పడ్డాయి. అటు బయటకి వెళ్లలేక ఇటు గుడారాల్లో ఉండలేక పిల్లాపాపలతో భక్తులు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# రైల్వే స్టేషన్లను తనిఖీ చేసిన.. డివిజన్ మేనేజర్ గుప్తా


పలు రైల్వే స్టేషన్ లను తనిఖీ చేసిన డిఆర్ఎం గుప్తా..

గుంతకల్ రైల్వే మే 06 ప్రభాతవార్త

గుంతకల్ రైల్వే డివిజన్ అదోని రైల్వే స్టేషన్, మంత్రాలయం, రాయచూర్ రైల్వే స్టేషన్లను సంబంధిత శాఖాధికారులతో కలిసి రైల్వే మేనేజర్ చంద్ర శేఖర్ గుప్త పరిశీలించారు. ఈ సందర్శన సందర్భంగా నిర్మాణంలో ఉన్న ప్రధాన ప్రవేశ ద్వారం, స్టేషన్ ముఖభాగం అలాగే ప్రతిపాదిత కార్యాలయ స్థలాలను సమీక్షించి అవసరమైన మెరుగుదలలను సూచించారు. సందర్శన సందర్భంగా కొనసాగుతున్న పనులను సమీక్షించి, రిటైరింగ్ గదులను పరిశీలించి, ఇతర ప్రయాణికుల సౌకర్యాలను అంచనా వేశారు. పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట సీనియర్ డిసీఎం మనోజ్, డీ యన్ నార్త్ హరి కృష్ణారెడ్డి, సీనియర్ డిఓఎం శ్రావణ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# లేపాక్షి వీరభద్రస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.4.48 లక్షలు

లేపాక్షి, మే 6 ప్రభాతవార్త


హుండీ లెక్కిస్తున్న దృశ్యం

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయం హుండీని బుధవారం లెక్కించారు. గత నాలుగు నెలల కాలానికి గాను భక్తులు మొక్కుల రూపంలో చెల్లించిన కానుకల ద్వారా 4,48,531 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.హెచ్. నరసింహమూర్తి వెల్లడించారు. ఆలయనాట్యమంటపంలో పర్యవేక్షణాధికారి బి.నాగరత్నమ్మఆధ్వర్యంలో ఈహుండీలెక్కింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పురావస్తు శాఖ ఎం.టి.ఎస్ రాము, గ్రామస్తులు వి.రవీంద్రనాథ్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. సేకరించిన నగదును నిబంధనల ప్రకారం బ్యాంకులో జమ చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# మృతురాలి కుటుంబానికి మండల విద్యాశాఖ ఆర్థిక సాయం

లేపాక్షి, మే 6 ప్రభాతవార్త


ఆర్థికసాయం అందచేస్తున్న దృశ్యం

లేపాక్షి కస్తూరిబా విద్యాలయంలో ఇంగ్లీష్ సిఆర్‌టిగా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుభామ్‌బీ కుటుంబసభ్యులకు లేపాక్షి మండల విద్యాశాఖ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో 57,800 రూపాయలను బుధవారం అందజేశారు. ఎంఈఓ నాగరాజు సూచనల మేరకు మండల పరిధిలోని పలువురు ఉపాధ్యాయులు తమ వంతుగా ఆర్థిక సహకారాన్ని అందజేశారు. మొత్తం నగదును ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మృతురాలి కుటుంబసభ్యులకు అందజేశారు.

# రాయితీతో వ్యవసాయ యంత్ర పరికరాలకై దరఖాస్తుల ఆహ్వానం

## -అర్హత, ఆసక్తిగల రైతులు ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి -వ్యవసాయశాఖ ఉరవకొండ సహాయ సంచాలకులు ఎస్.సత్యనారాయణ

ఉరవకొండ, మే 6 ప్రభాతవార్త


విలేఖరులతో మాట్లాడుతున్న ఉరవకొండ ఏడీఏ ఎస్.సత్యనారాయణ

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా 2025-26 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యక్తిగత వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను వ్యవసాయశాఖ ద్వారా రాయితీతో అందిస్తోందని అర్హత, ఆసక్తిగల రైతులు ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఉరవకొండ సహాయ సంచాలకులు ఎస్.సత్యనారాయణ కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ రైతులకు కేంద్ర ప్రభుత్వంచే ఆమోదించబడిన ఎఫ్ఎం టీటీఐ కేంద్రాల్లో జారీ చేయబడిన పరీక్షా పత్రాలు ఉన్న యంత్ర పరికరాలను మాత్రమే రైతులకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. భూమి ఉన్న రైతులు ఆర్వోఎఫ్ఆర్ రైతులు, గత మూడు సంవత్సరాల్లో కనీసం మూడు పంటల సీజన్లలో ఈ-పంట అప్లికేషన్‌లో బుక్ చేసిన, సీసీఆర్సీ కల్గిన రైతులు అర్హులన్నారు. 2024-25లో రాయితీ పొందిన లబ్దిదారులు అర్హులు కారని కుటుంబంలో ఒక సభ్యుడు మాత్రమే ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డివిజన్‌లోని ఆయా మండలాల రైతులు అవసరమైన యంత్ర పరికరాలకోసం ఆన్‌లైన్ పోర్టల్ లేదా స్వతంత్రంగా గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. భూమి రికార్డులు, అటవీ హక్కుల రికార్డు ఆర్వోఎఫ్ఆర్, ఈ-పంట నమోదు, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ రైతు కేటగిరి ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు, మహిళా రైతులకు యంత్రాల యూనిట్ ధరలో 50శాతం ఇతర రైతులకు 40శాతం రాయితీ లభిస్తుందన్నారు. ట్రాక్టర్ పనిముట్లు, విత్తనం నాటడం త్రవ్వే యంత్రాలు, స్ప్రేయర్లు, స్వీయ చోదక ఇంప్లిమెంట్లు, ట్రాక్టర్లు-40హెచ్‌పీ, మినీ ట్రాకర్లు, పవర్ టిల్లర్లు, హార్వెస్టింగ్, నూర్పిడి యంత్రాలు, పంట తర్వాత, విలువ జోడింపు యంత్రాలు, అవశేష నిర్వహణ ఎండు గడ్డి, మేత సామాగ్రి అందించడం జరుగుతుందన్నారు. ఖరారు చేసిన లబ్దిదారులు జిల్లా ఇంచార్జ్ మంత్రి ఆమోదంతో ఉన్న జాబితాను లాటరీ విధానంలో ఎంపిక చేసిన తర్వాత జాయింట్ కలెక్టర్ ద్వారా లబ్దిదారులకు మంజూరు పత్రం జారీ చేయబడుతుందన్నారు. ఎంపికైన వారికి ఎస్ఎంఎస్ పంపడం జరుగుతుందన్నారు. యంత్ర పరికరాల కోసం ఉరవకొండ సబ్ డివిజన్‌కు 1,58 కోట్ల రూపాయలు కేటాయించగా గుంతకల్లు మండలానికి 35.88 లక్షలు, ఉరవకొండ మండలానికి 48.40 లక్షలు, వజ్రకరూరు మండలానికి 48.49 లక్షలు, విడపనకల్లు మండలానికి 32.03 లక్షలు కేటాయించడం జరిగిందని ఏడీఏ ఎస్.సత్యనారాయణ వివరించారు.

## తక్కువ పెట్టుబడి.. అధిక లాభాలు చూపించడమే లక్ష్యం

### - అపరాజిత ప్రాపర్టీస్ అండ్ ఫామ్ ల్యాండ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ శ్రీనివాసరావు

అనంతపురం కల్చరల్, మే 6 ప్రభాతవార్త

సామాన్య ప్రజల ఆశలు నెరవేర్చుకునేందుకు తమ సంస్థలో తక్కువ పెట్టుబడి పెడితే.. అధిక లాభాలు చూపిస్తా మని అపరాజిత ప్రాపర్టీస్ అండ్ ఫామ్ ల్యాండ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం నగరంలోని 2వ రోడ్డులో గల వారి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా రూట్ కల్చర్డ ఎర్రచందనం ప్లాంటేషన్ చేస్తున్న ఏకైక సంస్థ తమదన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్లాంటేషన్ ఉంటుందన్నారు. 25 సెంట్లలో 100 ఎర్ర చందనం మొక్కలు పెంపకం చేపట్టవచ్చని, ఇందుకు రూ.10.50 లక్షల ఖర్చవుతుందన్నారు. సమగ్ర భూసార పరీక్షలు చేసిన తర్వాతనే రెండేళ్ల వయసున్న మొక్కలను పెంచుతామన్నారు. అంతేకాకుండా మొక్కలకు సంరక్షణ కోసం జీపీఎస్, రిటైర్డు అర్మీ వ్యక్తి, సీసీ కెమెరాలు, డాగ్స్, విద్యుత్ ఫెన్సింగ్, డ్రిప్ పద్దతి, సోలార్‌తోపాటు మీరు ఇంటి నుంచే ఈ మొక్కల సంరక్షణ చూసుకునేలా గూగుల్ మ్యాప్ ఉంటుందన్నారు. ఈ ఎర్రచందనం కట్ చేసే సమయం 12 ఏళ్లు పడుతుందని, ప్రభుత్వం



మాట్లాడుతున్న అపరాజిత ప్రాపర్టీస్ అండ్ ఫామ్ ల్యాండ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ శ్రీనివాసరావు

అనుమతి తీసుకున్న తర్వాత కటింగ్ ఉంటుందన్నారు. కస్టమర్ పెట్టిన పెట్టుబడి పదింతలవుతుందన్నారు. వచ్చే ఆదాయంలో కస్టమర్లకు 60 శాతం, సంస్థకు 40 శాతం ఉంటుందన్నారు. అంతేకాకుండా 12 ఏళ్ల తర్వాత భూమి ధరలు కూడా రెట్టింపు అవుతాయన్నారు. వారి పిల్లల సహకారానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ నిశిత, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖాదర్‌వలి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఎస్.బి.ఎన్ డిగ్రీ కాలేజీలో నిట్ ఫౌండేషన్, ఇన్ఫోసిస్ సహకారంతో ఘనంగా ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహణ

అనంతపురం న్యూటౌన్, మే 6 ప్రభాతవార్త

స్థానిక ఎస్.ఎస్.బి.ఎన్ డిగ్రీ కాలేజీలో కెరీర్ డెవెలప్మెంట్ సెల్ ఆధ్వర్యంలో, నిట్ ఫౌండేషన్, ఇన్ఫోసిస్ సంస్థల సహకారంతో బుధవారం విద్యార్థుల భవిష్యత్ ఉపాధి అవకాశాలను పెంపొందించే లక్ష్యంతో ప్లేస్మెంట్ డ్రైవ్ ఘనంగా నిర్వహించబడిందని కళాశాల ప్రిన్సిపాల్ డా.సి.సరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్లో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటగా, నిర్వాహకులు విద్యార్థులకు వివిధ కంపెనీలలో లభ్యమవుతున్న ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన ప్రధాన కార్యక్రమంలో నిపుణులు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకొని, అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను సద్విని యోగం చేసకోవాలని సూచించారు. ఈ డ్రైవ్ ద్వారా కస్టమర్ సపోర్ట్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, టెలికాలింగ్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్, మాన్యుఫ్యాక్చరింగ్ మరియు సేల్స్ వంటి విభాగాల్లో ఫ్రెషర్లకు అనేక ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. ఎంపికైన అభ్యర్థులకు సుమారు రూ.15-25వేల వరకు వేతనాలు ఆఫర్‌చేయ బడుతు న్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కెరీర్ డెవెలప్మెంట్ సెల్ కన్వీనర్ డా.కె.పి. వెంకటేశ్వరరావు, సభ్యులు డా.ఎం.బాబా పక్రుద్దీన్, డా.ఆర్.శాంతి, డా.కె.శారద, డా.ఆర్.మాధవి, ఎస్.శివ ప్రసాద్ రెడ్డి, ఎం.సురేంద్ర, బి.యోగేశ్వర్ అధ్యాపకులు బి.మాలతి, జి.మానస పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు మంచి అవకాశాలను కల్పించడంలో ముఖ్యపాత్ర పోషించిందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన కళాశాల ప్రెసిడెంట్ శ్రీ పి.వి. రమణారెడ్డి, సెక్రటరీ శ్రీమతి కె.నిర్మలమ్మ, కరెస్పాండెంట్ శ్రీ పి. ఎల్. ఎన్. రెడ్డి గార్లకు నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## చదరంగ పోటీలలో సత్తా చాటిన జాన్విత

అనంతపురం సిటీ, మే 6 ప్రభాతవార్త

నగరానికి చెందిన ఓనం జాన్విత చదరంగం పోటీలలో సత్తాచాటి ఇంటర్నేషనల్ ర్యాపిడ్ ఫిడే 14.61 రేటింగ్‌లో ర్యాంకును సాధించింది.

నగరంలోని ఎ1 చెస్ అకాడమిలో శిక్షణ పొందుతున్న ఓనం జాన్విత రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పలు పతకాలను సాధిం చింది. బెంగుళూరులో మార్చి 28న నిర్వహించిన చెస్ టోర్నీలో అండర్-10 బాలికల విభాగంలో 8వ స్థానాన్ని సాధించి, ట్రోఫీ, ప్రశంసా పత్రాన్ని సాధించింది. అదే విధంగా మార్చి 29న నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ ఫిడే రేటెడ్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో దేశ వ్యాప్తంగా 815 మంది క్రీడాకారులు పాల్గొనగా ఓనం జాన్విత అండర్-11 బాలికల విభాగంలో 5-9పాయిం ట్లతో ఆరో స్థానం సాధించి మెడల్, ప్రశంసా పత్రాన్ని గ్రాండ్ మాస్టర్ తేజ్‌కుమార్ చేతులు మీదుగా అందుకుం ది. దీంతో అఖిల భారత చెదరంగ సమాఖ్య సంయు క్తంగా ప్రచురించిన ఫలితాల్లో ఇంటర్నేషనల్ ర్యాపిడ్ ఫిడే రేటింగ్ 14.61ని ఓనం జాన్విత సాధించడం పట్ల కోచ్ ఉదయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో రాణించి భారత దేశం తరుపున ప్రాతినిధ్యం వహించాలని ఆయన ఆకాంక్షించారు.

## సమస్యల పరిష్కారం అయ్యే వరకు సమ్మె

నార్పల మే 6, ప్రభాతవార్త

నార్పల మండలం బి పప్పూరు సత్యసాయి మంచినీటి పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమ్మె బుధవారం రెండవ రోజుకు చేరుకుంది. కార్మికులు నీటి పథకం ముందు కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. గత ఐదు నెలలుగా వేతనా లు అందక,కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. నీటి పథకానికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించక పోవడం దుర్మార్గం అన్నారు.

అదే విధంగా బోర్డు ఆధీనంలో సవ్య ంగా నడుస్తున్న నీటి పథకాన్ని జిల్లా పరిషత్‌లో విలీ నం చేసే ప్రక్రియ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో పలమార్లు కార్మిక సంఘాల నాయకు లు అధికారులు ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కరించలేదన్నారు. కార్మికులు గత్యంతరం లేని పరిస్థితుల్లో నిరవధిక సమ్మె చేపట్టినట్లు కార్మిక సంఘం నాయకులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డిమాండ్లను పరిష్కరిం చకుంటే ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూని యన్ నాయకులు శంకర్నాజనేయులు, లింగానాయుడు ,ప్రభాకర్, హనుమంతు,అంకన్న, శ్రీరాములు, ఈశ్వరయ్య, పుల్ల నాయుడు,రమేష్,చంద్రమోహన్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## ఏపీపీఎఫ్ 1938 జిల్లా నూతన కమిటీ ఎన్నిక..

### - జిల్లా అధ్యక్షులుగా రవీంద్ర.. - జిల్లా ప్రధాన కార్యదర్శిగా హనుమప్ప - జిల్లా గౌరవ అధ్యక్షులుగా అశోక్ నాయక్

అనంతపురం న్యూటౌన్, మే 6 ప్రభాతవార్త

నగరంలోని ఎన్జీవో హోంలో ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.

ఏపీటీఎఫ్ 1938 జిల్లా నూతన అధ్యక్షులుగా జి.రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా బి.హను మప్ప, జిల్లా గౌరవ అధ్యక్షులుగా అశోక్ నాయక్, అసోసియేట్ అధ్యక్షులుగా హనుమంతు నాయక్, అదనపు కార్యదర్శిగా పోతులయ్యను, ఉపాధ్యక్షు లుగా వజీర్ భాష, బహేశ్వర, నాగరాజు, సాయినాథ్ రెడ్డి, కార్యదర్శులుగా హనుమంతు, దామోదర్, రామాంజ నేయులు, మల్లినాథ్, ఫక్రుద్దీన్, కాంతిరాజ్, 24 మంది రాష్ట్ర కౌన్సిలర్లను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఈ సమావేశానికి ఎన్నికల అధికారిగా మాధవ స్వామి నంద్యాల జిల్లా అధ్యక్షులు, ఎన్నికల పరిశీల కులుగా



జి.రవీంద్ర, బి.హనుమప్ప, కె.అశోక్‌నాయక్

అబ్దుల్లా కడప జిల్లా ప్రధాన కార్యదర్శి వ్యవహ రించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట సుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, ఐఫియా కమిటీ సభ్యులు సత్యప్రసాద్ ఆయా మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిల్లా కౌన్సిలర్లు సబ్ కమిటీ సభ్యులు మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 26 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం !

రాప్తాడు, మే 6 ప్రభాతవార్త

రాప్తాడు గ్రామంలో స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో 2000-01న 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక బుధవారం ఘనంగా జరిగింది. 25 సంవత్సరాల తరువాత వారికి విద్యాబుద్దులు చెప్పిన నాటి గురువులను ఒకే వేదికపై తీసుకొచ్చారు. పూర్వ విద్యార్థులు అందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వివిధ వృత్తులలో ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ గత స్మృతులను నెమరు వేసుకుంటూ తాము చదువుకున్న పాఠశాల తీపి కబుర్లు,తమ అనుబంధాలను స్మరించుకున్నారు. ఒకరికొకరు చెప్పుకుంటూ సెల్ఫీలు తీసుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. పూర్వ విద్యార్థులు అధ్యాపకులకు శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులను ఒక చోటకు తీసుకొచ్చేందుకు అహర్నిశలు కృషి చేసిన పూర్వ విద్యార్థులు సుబ్బు, గోపాల్, లక్ష్మినారాయణ, మురళి, తదితరులకు అధ్యాపకులతోపాటు పూర్వ విద్యార్థులు శాలువాతో సన్మానించి అభినందించారు.



2000-01 బ్యాచ్ పూర్వపు విద్యార్థులు

## జూన్ 7న పద్మశాలి విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు పంపిణీ

జిల్లా అధ్యక్షులు జింక సూర్యనారాయణ.

అనంతపురం రూరల్, మే 06 ప్రభాతవార్త:

అనంతపురము జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘము వారు ప్రతిభకు సంకల్పించి ఇటీవల అనంతపురము జిల్లాలో 10 వతరగతి, మరియు ఇంటర్ ఇడియట్ లో పద్మశాలి విద్యార్థు లందరు ఉత్తీర్ణత లవడం జరిగిందని . ఇందుకుగాను అనంతపురము జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘము వారు పద్మశాలి విద్యార్థులందరికి ప్రతిభా పురస్కారాలు,బహుమతులు ఇవ్వదలిచామని పద్మశాలి సంక్షేమ సంఘం. అనంత జిల్లా అధ్యక్షులు జిల్లా సూర్యనారాయణ, మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల నరసింహులు తెలిపారు. ఈ సందర్బంగా వారు తపోవనంలోని మార్కండేయ దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జూన్ 7 వతేది జిల్లాలోని పద్మశాలి విద్యార్థులకు బహుమతులు ఇవ్వదలిచామని వారు తెలిపారు. పదవ తరగతి మరియు ఇంటర్ ఇడియట్ లో ప్రతిభ కనబరచిన మొదటి, రెండవ, మూడవ బహుమతులు ఇవ్వదలచామని,అలాగే మిగిలిన విద్యార్థులందరికి కన్సలేషన్ బహుమతులు కూడా ఇవ్వడం. జరుగుతుందన్నారు. ఈ పెద్ద ఎత్తున జరిగే ప్రతిభా పురసారాల కార్యక్రమున్ని జిల్లాలో ఉన్న వారి సహకారంత 12 పద్మశాలి సంక్షేమ సంఘాలు, పదిశాతి ఉద్యన సంతర్యం అనంతపురంజిల్లా శాఖ, అనంతపురం నగర పత్తిశాలి సంక్షేమ సంఘం వారి సంయుక్తంగాజరుగుతుందన్నారు.

## అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంతీయ కోఆర్డినేటర్‌గా ఆర్.శ్రీరాములు

అనంతపురం న్యూటౌన్, మే 6 ప్రభాతవార్త

అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం ప్రాంతీయ( అనంతపురం) కోఆర్డినేటర్‌గా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కామర్స్ అధ్యా పకులు ఆర్.శ్రీరాములు నియమి తులయ్యారు. అంబేద్కర్ యూని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య విజయ భాస్కర రావు ఈనెల 4వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీరా ములు బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ పద్మశ్రీ, ప్రస్తుత కోఆర్డినేటర్ శేషారెడ్డి ఆయనకు అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కేంద్రంగా ఈ ప్రాంతీయ కేంద్రం ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తోంది.



శ్రీరాములును సత్కరిస్తున్న దృశ్యం

## 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి సత్కారాలు

అనంతపురం న్యూటౌన్, మే 6 ప్రభాతవార్త

స్థానిక ఉపాధ్యాయ భవన్ నందు అనంతపురం జిల్లా గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ సంఘం (జిటిఎ, ఎటిపి) తరఫున జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య 12 పాఠశాలల్లోని పదవ తరగతి పరీక్షల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి సమక్షంలో ఘనంగా సత్కరించి వారు భవిష్యత్తులో మరిన్ని అత్యున్నత స్థానాలకు ఎదగాలని కాంక్షిస్తూ వారికి భవిష్యత్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహంతో పాటు సర్టిఫికెట్, మెమెంటోలను అనంతపురం జిల్లా ఉప విద్యాధికారి శ్రీనివాసరావుచే, గుత్తి ఉప విద్యాధికారి లక్ష్మన్నచే, డిసిఈబి సెక్రెటరీ గంధ మనేని శ్రీనివాసులుచే, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులచే ప్రధానం చేశారు.



ప్రతిభ కనబర్చిన వారిని సత్కరించిన దృశ్యం

## అసిస్టెంట్ లోకో పైలెట్, గ్రూప్ డి, ఏ.పి. హైకోర్టు 2026 పరీక్షలకు ఉచిత శిక్షణ

అనంతపురం న్యూటౌన్, మే 6 ప్రభాతవార్త

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, విజయవాడ వారి ఆదేశాల మేరకు రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు అసిస్టెంట్ లోకో పైలెట్, గ్రూప్ డి, ఏ.పి. హైకోర్టు 2026 పరీక్షలకు అర్హులైన ఉమ్మడి అనంతపురము జిల్లాకు చెందిన బి.సి., యస్.సి., యస్.టి. అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బి.సీ. స్టడీ సర్కిల్, అనంతపురము సంచాలకులు ఖుష్బూ కొఠారి ఒక పత్రికా ప్రకటన ద్వారా తెలియజేసారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ లోగా ఆంధ్రప్రదేశ్ బి.సీ స్టడీ సర్కిల్, అనంతపురము కార్యాలయము నందు దరఖాస్తు చేసుకోవలెనని తెలిపారు. మరిన్ని వివరాలకు నేరుగా కార్యాలయములో గాని, ఫోన్ నెంబర్లు 9704204905, 9550250770, 8309006875లో సంప్రదించగలరని బి.సి. స్టడీ సర్కిల్ సంచాలకులు శ్రీమతి ఖుష్బూ కొఠారి తెలియజేసారు.

## 8న బి.టెక్, ఎంబిబిఎస్, బిఎఎంఎస్, లాకు కౌన్సిలింగ్

అనంతపురం, మే 6 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం మొదటి రోడ్డులో గల శ్రీకాశీ విశ్వేశ్వర, కోదండ రామాలయం ఫంక్షన్ హాల్లో కంచి విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో బి.టెక్, ఎంబిబిఎస్, బిఎఎంఎస్, లా, డిగ్రీ కోర్సెస్‌లకు స్పోర్ట్ కౌన్సిలింగ్, అడ్మిషన్స్‌ను యూనివర్సిటీ ప్రతినిధులు ఈ నెల 8 శుక్రవారం సాయంత్రం 5గంల నుండి రాత్రి 8 గంల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదా అవకాశాన్ని జిల్లా వాసులు ఉపయోగించుకోవాలని కోరడమైనది. ఈ సమావేశంలో జిల్లా బ్రాహ్మసంఘం నాయకులు ఎఎల్ఎన్ శాస్త్రి (రాష్ట్ర నాయకులు), అడ్వకేట్ రామ సుబ్రమణ్యం, సివి.మురళీధర్, కరణం, రామసుబ్బారావు, నార్పల మారుతి, సత్యనారాయణ శర్మ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకకు హాజరైన దేగల కృష్ణమూర్తి

.శింగనమల,

మే 6 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన శింగనమల ఆయకట్టు చైర్మన్ కుమారుడు నవీన్ వివాహ వేడుకకు రాష్ట్ర పంచాయితీ రాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఆయన వెంట టిడిపి నాయకులు మాసుల్ చంద్రమోహన్, మట్లగొంది పుల్లయ్య, కోయగూర పెద్దన్న, రాజశేఖర్ యాదవ్ తదితరులు ఉన్నారు.



నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న దేగల కృష్ణమూర్తి

## వివాహానికి ఆర్థిక సాయం

శింగనమల, మే 6 ప్రభాతవార్త

మండల పరిధిలోని గురుగుంట్ల గ్రామానికి చెందిన గంగమ్మ-తిరుపాల్‌కు మార్తె పావణి వివాహ వేడుకకు నాగలగుడ్డం గ్రామానికి చెందిన వైఎస్ ఆర్‌సిపి నాయకుడు దాసరి వెంకటరమణ రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన దంపతులు సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నాగలింగ, నాగరాజు, లక్ష్మన్న, ఓబులేసు, రామలక్ష్మణుడు, ఓబుళపతి, శివ, తిరుపతయ్య, పెన్నోబిళేసు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న దాసరి వెంకట రమణ

## ఉచిత ఖత్నా

అనంతపురం కల్చరల్, మే 6 ప్రభాతవార్త

గుల్షన్ పమౌలా అలీ ఖిద్‌మత్ కమిటీ ఆధ్వర్యంలో దాదాపాలీ క్లినిక్ బహుద్దీన్ మసీదు పక్కన 2వ రోడ్డులో ఉచిత ఖత్నా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు హాజీమహబూబ్ బాషా (మున్నా) 8886068844, హాజీ మహ్మద్ షఫి 9490032989 కమిటీ మెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## ఘనంగా చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

తాడిపత్రిఅర్బన్,

మే 6 ప్రభాతవార్త

తాడిపత్రి మండలం చిన్నపొలమడ గ్రామంలో చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి విగ్రహ పున ఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అర్చకులు చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే హోమాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అశ్వత్థం దేవస్థానం ఇఒ సుబ్రమణ్యం, తపటి సుబ్రమణ్యం, సిబ్బంది అరుణ్, పెద్దఎత్తున గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, మే 6 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన శింగనమల ఆయకట్టు ప్రెసిడెంట్ బోయ సత్యనారాయణ కుమారుడు నవీన్‌కుమార్ వివాహ వేడుకకు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఆమెతోపాటు టిడిపి నాయకులు వెంకటశివుడు యాదవ్, సుధాకర్ యాదవ్, శింగనమల మార్కెట్‌యార్డు చైర్మన్ దండుశ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ మారుతి నాయుడు, రాష్ట్ర పంచాయితీ రాజ్ ఛాంబర్ సభ్యులు దేగల కృష్ణమూర్తి, మాజీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, చితంబర దొర, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ యాదవ్, మాసుల్ చంద్రమోహన్, రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ ఎం. ఆదినారాయణ, లాయర్ ఈశ్వర్‌రెడ్డి, సి.వెంకటేష్, చలమయ్య, విశ్వనాథ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ముంతా వెంకటేష్, కాయల్ రమణయాదవ్, కురాకు రాముడు, మట్లగొంది రమేష్, సింగిల్ విండో అధ్యక్షులు గుర్రం లక్ష్మినారాయణ తదితరులు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు.



నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

## సామాజిక సేవారంగంలో తనదైన ముద్ర వేస్తున్న రవికాంత్ రమణ

బుక్కరాయసముద్రం మే 6 ప్రభాతవార్త

సామాజిక సేవారంగంలో తనదైన ముద్ర వేస్తున్న రవికాంత్ రమణ పేదల పెన్నిదిగా కొప్పుల మీనాక్షమ్మ ట్రస్ట్ సేవలు అమోఘం పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం రవికాంత్ రమణ 77 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన జన్మదిన వేడుకలు అభిమానులు,విద్యార్థులు,రాజకీయ నేతల మధ్య అత్యంత వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా ఆయనను కలిసిన పలువురు ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు కొనియాడారు.తరలివచ్చిన ప్రముఖుల్లో ఏడిసిసి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి,టిడిపి నాయకుడు ఆలం నరసా నాయుడు,టిడిపి రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి రామలింగారెడ్డి,శింగనమల మార్కెట్ యార్డ్ చైర్మన్ దండు శ్రీనివాసులు, బుక్కరాయసముద్రం మండల టిడిపి నాయకులు మాజీ మండల కన్వీనర్ అశోకుమార్,సింగిల్ విండో అధ్యక్షులు కేశన్న, కన్వీనర్ లక్ష్మినారాయణ,మాజీ సర్పంచ్ ఎస్.నారాయణ స్వామి,తోపాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిదులు, ప్రభుత్వ అధికారులు,అనధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని రవికాంత్ రమణ కు బొకేలతో పూలమాలలో,శాలవాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వక్తలు మాట్లడుతూ రవికాంత్ రమణ తన భార్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కొప్పుల మీనాక్షమ్మ ట్రస్ట్ ద్వారా అనంతపురం,శింగనమల నియోజకవర్గంలో అందిస్తున్న పలు సేవా కార్యక్రమాలు గుర్తుచేశారు. ముఖ్యంగా ఉచిత కంటి ఆపరేషన్లు ప్రతి నెల 6 లక్షల వ్యయంతో పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తూ వారికి చూపును ప్రసాదించారు. పేద విద్యార్థులకు,వికలాంగులకు ఉచిత విద్యను అందించడంతో ట్రస్ట్ ముందుంటోంది.ఆనారోగ్యం బారిన పడిన పేదలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు తాగునీరు,అందిస్తున్నారు.మానవ సేవయే మాధవ సేవగా భావించి రవకాంత్ రమణ చేస్తున్న కార్యక్రమాలు కొనియాడినారు. అనంతరం జన్మదిన సందర్భంగ కేక్‌ను కట్‌చేశారు.



సామాజిక సేవారంగంలో తనదైన ముద్ర వేస్తున్న రవికాంత్ రమణ

## అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ ఏపీ మహిళా విభాగం అధ్యక్షురాలుగా డాక్టర్ విజయకుమారి నియామకం.

అనంతపురం రూరల్, మే 06 ప్రభాతవార్త:

అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ మహిళా విభాగం అధ్యక్షురాలుగా రెవరెండ్ డాక్టర్ విజయకుమారీ కూరాకులనునియామించడం జరిగిందని ఆ సంఘం అధ్యక్షులు తెలిపారు. బుధవారం వాల్మీకి కళ్యాణ మండపం ద్రంపేట బైపాస్ నందు ఏఐసీసీ స్టేట్ మహిళా విభాగం అధ్యక్షురాలు రెవ: డాక్టర్ విజయ కుమారి అధ్యక్షతన జరిగింది. ప్రారంభ ప్రార్థన పాస్టర్ రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు అనంతపురం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ అధ్యక్షులు, ఇండియన్ పోస్టల్ స్టాంప్ అవార్డు గ్రహీత రెవ: డా గెర హనోక్,మాట్లాడుతూభారతదేశ చరిత్రలోనే ఎవరు గలమెత్తని విధముగా క్రైస్తవుల పక్షాన పోరాడి అనేక సంగతులను పరిష్కరించడం జరిగినదని .మరియు కోటి మంది సభ్యత్వంతో ప్రణాళికబద్ధంగా క్రైస్తవ సమాజాన్ని కాపాడుకోవడానికి మనమందరము ఐక్యతతో ఉండాలని ఉపదేశించారు.మరియు డా: ఎలియాజరు ఏఐసీసీ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ క్రైస్తవుల ఐక్యత, ప్రార్ధన కోరి యున్నారు .ఇట్టి కార్యక్రమములో నూతన కార్యవర్గ సభ్యులు ఎంపిక చేయబడ్డారు. జిల్లా ప్రెసిడెంట్ గా రెవ:యెషయా , ఉపాధ్యక్షులుగా రెవ. మనషే , గౌరవ అధ్యక్షులుగా రెవ: రెడ్డివారి నెహెమ్యా నాగరాజు రెవ: అనిల్ మోజెస్, రెవ : కురాకుల ఐజయా, రాయలసీమ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ గా రెవ:వై పి బాబు , వీరితో పాటు 19 విభాగాల అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది. క్రైస్తవ నాయకులు జాన్ వెస్లీ , కమల్ , థామస్, గంధం ప్రకాష్ ,జానీ , స్టేట్ మైనారిటీ టిడిపి క్రిస్టియన్ అధ్యక్షులు ఈటె స్వామి దాసు, చల్లా కిషోర్ చౌదరి కళ్యాణదుర్గం , పాస్టర్ హరికృష్ణ రాయదుర్గం, పాస్టర్ జేమ్స్ పాల్ నాయక్ కళ్యాణదుర్గం, పాలిటెక్నికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ బాలస్వామి , వినోద్ తాడిపత్రి అరుణ గ్రేస్ కళ్యాణదుర్గం, అడ్వకేట్ రవికుమార్, జాషువా జహంగీర్ ,మార్కు,విజయసింహ అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగినది. అనంతరం గుంటూరు బైబిల్ మిషన్ ఏ ఓ రెవ:డాక్టర్ బందెల రాజు, ఎంపికైన కార్యవర్గమునకు నూతన వస్త్రములను బహుకరించి సత్కరించారు. చివరి ప్రార్ధన ఆశీర్వాదము, ప్రేమ విందుతో కార్యక్రమం ను ముగించారు.



విజయ కుమారికి నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

## సోమలదొడ్డి గ్రామంలోని ఓ హెచ్ ఎస్ ఆర్ ను తనిఖీ చేసిన ఆర్డబ్ల్యూఎస్ అధికారి

అనంతపురం రూరల్, మే 06 ప్రభాతవార్త:

అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి గ్రామ పంచాయతీ రిపేర్ లో ఉన్న ఉపరితల త్రాగు నీటి ట్యాంక్ ను ఓ హెచ్ ఎస్ ఆర్ ను తనిఖీ చేసిన మండల ఆర్. డబ్ల్యూ. ఎస్ ఇంజనీర్ హరి ట్యాంక్ మరమ్మతుల గురించి కాంట్రాక్టర్‌ను వివరాలు అడిగి కొన్ని సూచనలు చేశారు.అలాగే సోముల దొడ్డి మెయిన్ రోడ్డు లోని కాలువ పై ఉన్న కల్వర్టు ను రిపేర్ చేసి మురు గు నీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పంచాయితీ అభివృద్ధి అధికారి నీ ఆదేశించడంతో అయన వెంటనే వేసవి కాలం లో నీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టడం జరిగిందని స్థానిక నాయకులకు మరియు గ్రామప్రజలకు తెలియజేశారు.ఈ కార్యక్రమము లో పంచాయితీ అభివృద్ధి అధికారి యం.పవన్ కుమార్, రాచానపల్లి సింగిల్ విండో ప్రెసిడె ంట్ పాముారాయి రఘు, స్టోర్ డీలర్ నాగలింగ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


**CHANGE OF SURNAME**

I, RAVIKANTHA REDDY JANGAMREDDYGARI (old name) S/o CHENNAKESEVA REDDY JANGAMREDDYGARI residing at 00, Thimmampeta, Garladinne, Ananthapuramu, 515731, A.P. Changing my name from RAVIKANTHA REDDY JANGAMREDDYGARI (old name) to RAVIKANTHA REDDY JANGAMAREDDYGARI (new name). Hence forth, I am being RAVIKANTHA REDDY JANGAMAREDDYGARI for all transactions

**CHANGE OF SURNAME**

I, CHAKALI RAMESH (Old Name) residing at D.No. 3/997/2, CHITRAVATHI, PUTTAPARTHI, Sri Satya Sai District, AP. That I have changed my Surname CHAKALI RAMESH (old name) to GUDISI RAMESH (New Name) Hence forth my surname will be called as GUDISI RAMESH for all purposes.

SBI

RASMECC-61058, 2వ అంతస్తు, జూడియో షాపింగ్ మాల్ పైన, కళ్యాదుర్గం రోడ్డు, అనంతపురము - 515 004.
PH NO : 08554 232444, E-MAIL: sbi.61058@sbi.co.in

**ఇ-వేలం అమ్మకపు ప్రకటన** సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)కు నిబంధనలతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింది స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం అమ్మకం ప్రకటన.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు)కు మరియు హామీదారు(లు)కు ఈ దిగువ తెలిపిన స్థిరాస్తులు తనఖాపెట్టిన / చార్జ్ చేసిన సెక్యూర్డ్ క్రెడిటర్ వారికి ఉంచబడినవి సదరు ఆస్తులు అధికృత అధికారి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి లాంఛనప్రాయంగా స్వాధీనత చేసుకోబడి దిగువ నిర్దేశించబడిన నియమ నిబంధనలకు లోబడి అది "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "అక్కడ ఏమున్నదో అదే" దిగువ తెలిపిన వివరముల ప్రకారం ఇ-వేలం వెబ్‌పోర్టల్ https://baanknet.com ద్వార విక్రయించబడుతాయి.

ఆసక్తిగల కొనుగోలుదార్లు ఏదైన బ్యాంక్ పనిదినములో సంబంధిత అధికారి గారి ముందస్తూ అనుమతితో ఆస్తిని తనిఖీ చేసుకోవచ్చును.

**రుణగ్రహీత చిరునామా:** శ్రీ ఎబ్బిలి శ్రీనివాసులు తండ్రి ఎబ్బిలి సూర్యనారాయణ, H.No: 2-621,సిండికేట్ నగర్, అనంతపురం

**NPA Account No: 1) 38273918948 (H/L), 2) 38418365128 (Topup)**

**బకాయి మొత్తం:** 1) తేది 04-05-2026 నాటికి రూ. 11,99,479/- (పదకొండు లక్షల తొంభై తొమ్మిది వేల నాలుగు వందల డెబ్భై తొమ్మిది రూపాయలు మాత్రమే), 2) తేది 04-05-2026 నాటికి రూ. 17,95,538/- (పదహేడు లక్షల తొంభై ఐదు వేల ఐదు వందల మూప్పై ఎనిమిది రూపాయలు మాత్రమే) + తో పాటు తేది 05-05-2026 నుండి తదుపరి వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ॥.

**స్థిరాస్తి యొక్క పూర్తి వివరణ**

అనంతపురము R.D. & S.R.D. పరిధిలోని రాచానపల్లి గ్రామ పంచాయతీ ఏరియాలోని ఆస్తి. ఈ ఆస్తి శ్రీ ఇ.శ్రీనివాసులు, తండ్రి ఇ.సూర్యనారాయణ

| బాబు | సర్వే నం. | A.C | A.C | H.S | ప్లాట్ నం. | A.C | H.S |
|---|---|---|---|---|---|---|---|
| ప్రభుత్వ ఖుష్కి | 97 | 5.00 పైకి | 0.04 | 0.016 | 38 పైకి | 0.02 | 0.008 |

**సరిహద్దులు : తూర్పు :** కుమ్మరవాండ్ల ప్లాట్, **పడమర:** రోడ్డు, **ఉత్తరం :** వెంకటరాముడు యొక్క అదే ప్లాట్ నెం.లో మిగిలిన స్థలం **దక్షిణం :** పి.సి. రమణయ్య ప్లాట్. **కొలతలు : తూర్పు-పడమర :** 15 అడుగులు, **ఉత్తరం-దక్షిణం :** 59 అడుగులు. **మొత్తం విస్తీర్ణం : 96.8 చదరపు గజాలు.**

| రిజర్వు ధర | ఐయానా డిపాజిట్ (EMD) | బిడ్ పెంపుదల మొత్తం | ఇ-వేలం తేదీ మరియు సమయం |
|---|---|---|---|
| రూ. 31,20,000/- | రూ. 3,12,000/- | రూ. 25,000/- | 22-05-2026, ఉదయం 11-00 నుండి మధ్యాహ్నం 01-00 వరకు (10 నిమిషాల అపరిమిత ఆటో పొడిగింపులతో) |

అమ్మకం బ్యాంకు వారి నియమ నిబంధనలకు లోబడి జరుపబడును. తమ బిడ్లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలంలో పాల్గొనుటకు ముందుగా M/S PSB Alliance https://www.baanknet.com వారి వెబ్ పోర్టల్‌లో www.sbi.co.in/web/sbi - in - the - news /auction-notices, హెల్ప్‌లైన్ నం. 829120220, హెల్ప్‌లైన్ ఇ-మెయిల్ ఐడి: support.baank.net@psballiance.com మరియు ఇ-వేలం నియమ నిబంధనలు పూర్తి వివరములు పరిశీలించవలసిందిగా బిడ్డర్లను కోరడమైనది. ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తికి సంబంధించిన వివరాల కోసం ఛీఫ్ మేనేజర్ మొబైల్ నం. 9438652232, ఇ-మెయిల్ ఐడి : sbi.61058@sbi.co.in ఫీల్డ్ ఆఫీసర్ మొబైల్ నం. 9493571447, మరియు అధీకృత ఏజెన్సీ మొబైల్ నం. 9492946359 వారి సోమవారం నుండి శనివారం వరకు పనివేళలో సంప్రదించవచ్చును.

తేది : 04-05-2026
స్థలం : అనంతపురము

సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
RASMECC-61058, 2వ అంతస్తు, జూడియో షాపింగ్ మాల్ పైన,
కళ్యాదుర్గం రోడ్డు, అనంతపురము - 515 004.

